# నల్లకలువలు

కలువకొలను
సదానంద

పెళ్ళి చూపులకు బయలుదేరబోతూ-అద్దంలో చూసుకున్నాడు సుందరం. ముక్కు పెద్దదిగా,

పెదవులు లావుగా వుండి, తన మొహం బాగాలేదేమో ననిపించింది.

తలకు చమురు రాసి దువ్వెనతో దువ్వుకున్నాడు. వెం(ట్రుకలు అణగలేదు. నీళ్లతో తడిపాడు వెంట్రుకల్ని. అప్పటికీ అణగలేదు. దువ్వుతూ వుంటే వాటి యిష్టంగా రేగిపోతూ వున్నై. పాపిడీ సరిగ్గా రాలేదు. వెం(ట్రుకలంతా బూరుగుపత్తి విడదీసినట్లు చిందర వందరగా రేగిపోయి, తల పెద్ద బుట్టలా కనిపించింది. తానొక భూతంలా వున్నానని పించింది. విసుగు పుట్టింది. మర్నాటి ఉదయమే కొండకెళ్లి పాడు వెం(ట్రుకల్ని తీయించి పారేయాలనుకున్నాడు. (ప్రాణాన్ని విసిగించే ఈ (క్రాపుకన్నా ఆ గుండే నయమని పించింది. గట్టిగా దువ్వి దువ్వి (ప్రయోజనం లేక కోపంతో జుట్టుపీకి, దువ్వెన విరగ్గొట్టి, అద్దాన్ని గోడకేసి విసిరికొట్టాడు. ఒళ్ళు తెలియని కోపమొచ్చింది. ఆ కోపంలో ఏడుపొచ్చింది.

... తాను బావున్నాడా లేడా అన్న సందేహం సుందరాన్ని చాలా కాలం నుండి పీడిస్తోంది. 'నేను బాగానే వున్నాను' అనుకుంటాడు, ఒక్కొక్కప్పుడు. 'అయ్యో నేనిలా వున్నానేంటి ?'' అనుకుంటాడు మరొకప్పుడు. 'నేను బాగున్నాను, నాకు ఏమీ లోపం లేదు' అనుకొన్నప్పుడు. బలే మురిసిపోతాడు. గర్వపడతాడు. కాని-'నేను యిలా అసహ్యంగా వున్నానేమిటి ?' అనుకొన్నప్పుడు దిగాలు పడిపోతాడు. చిన్నబోతాడు. ఎప్పుడూ — ఈ రెండు విధాల అనుభూతులే ఒకటి గెలవలేక, ఒకటి ఓడిపోలేక, పోట్లాడుకుంటూ వుంటై, అతని యువక హృదయంలో.

స్నేహితులంతా అంటుంటారు — తనకు ముక్కు పెద్దదనీ, పెదిమలు లావనీ, పార పళ్లనీ, దొంగ కళ్ళూ అనీ ...

'ఏమి ఆకీవి ! ...' అని ఒకడు,

'కంతుడో, జయంతుడో, నలకూబరుడో దిగివచ్చినయట్లు...' అని రెండో వాడు,

'గంగా తీరముల వంటి యా పెదవులు, హిమాచలము వంటి యా నాసిక ...' అని యింకొకడు.

'కైబరు బోలను కనుమల వంటి యా నాసికా రం(ధములు...' అని మరొకడు.

'ఉత్తర దక్షిణములను జూచు ఆ కనుదోయి...' అని వేరొకడూ అభినయ పూర్వకంగా వర్ణిస్తూంటే — పగలబడి నవ్వుతారందరూ.

ఒక్కొక్కడు ఒక్కోరకంగా నవ్వుతాడు. ఒకడి నవ్వుకు, యింకోడి నవ్వుకూ పోలికే వుండదు. గుర్రం సకిలించినట్లు ఒకడు, కందిరీగ రొదచేసినట్లు ఒకడు, కాకి అరిచినట్లు ఒకడు, గాడిద ఓం(డ పెట్టినట్లు ఒకడు, దున్నపోతు రంకె వేసినట్లు ఒకడు, నక్క ఊళపెట్టి నట్టు ఒకడు ... బోలెడు రకాలు ! వాళ్లు నవ్వడం చూస్తే, నవ్వుల్లో కూడా జాతులూ, కులాలూ వున్నాయా అనిపిస్తోంది.

అంతా చూసి ఆగలేక తానూ ఘొళ్ళుమని నవ్వేస్తాడు, సుందరం.

... అలాంటి సందర్భాలలో 'పిల్లికి చెలగాటం, ఎలుకకు (ప్రాణ సంకటం' అన్నట్లుగావుంటుంది అతనిస్థితి. తనమనస్సు ఎంత నొచ్చుకుంటుందో అని అయినా ఆలోచించరు, ఆవతలి వాళ్ళు.

తనను చూచి పరిహసించడం దేనికి ? అందరూ అందంగానే వుంటారా? ... మనిషి స్వశక్తితో సాధించుకుంటే వచ్చేదా, అందం ?

అయినా—తాను వాళ్లలాగా అంత అందంగా లేకపోయినా, తనకున్న హృదయం వాళ్లకెక్కడ వుంది?... తన హృదయం మృదువైనది. ఒకరిని నొప్పించాలన్న బుద్ధులు లేవు దానికి. ఒకరి కష్టాన్ని చూస్తే జాలిపడుతుంది. సంతోషం పువ్వులై పూచేచోట నవ్వుల పల్లవి పాడుతుంది. ఎదుటివారి హృదయాన్ని బాగా అర్థం చేసుకుని దానికి అనుగుణంగా నడుచుకుంటుంది.

తనకు ముక్కు పెద్దదైతేనేం, పెదవులు లావైతేనేం, పళ్లు ఎలా వుంటేనేం... తన హృదయం సుందరంగా వుంది. అది చాలు తనకు! మనిషికి హృదయ సౌందర్యం కావాలి గానీ, బాహ్యసౌందర్యం ఏం చేయను?




విసరికొట్టిన అద్దాన్ని చేతికందుకున్నాడు సుందరం.

అద్దం విరిగిపోలేదు !

* * *

ముహూర్తం దగ్గరపడుతూన్న కొద్దీ సుందరం గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. మళ్లీ అదే సందేహం !... తాను అందంగా లేడేమో ?

మళ్లీ మాటిమాటికీ మొహం అద్దంలో చూసుకుంటాడు. ఫరవాలేదు. (క్రాపు బాగానే వుంది. ముక్కు ఏమంత పెద్దదికాదు గానీ, కాస్త...అంతే! పెదిమలు ఏమంత లావు కావేమో? కొంచెం లావులేకుండావుంటుందా? అయినా పెదవులు లావుగా లేకపోతే ఏమందం? ... నవ్వినపుడు మాత్రం అదోలా వుంటుంది. గట్టిగా నవ్వకుండా పెదవులు బిగబట్టి సన్నగా, జాగ్రత్తగా నవ్వితే బావుంటుంది — అందంగానూ, స్టయిల్ గనూ.

...ఇటువంటి సమాధానాలలో సంతృప్తి

పడినతరువాత పెళ్లికూతుర్నిగురించి ఆలోచించడం మొదలెట్టాడు.

వాళ్ళూ మంచి కుటుంబంవాళ్ళే. తమలాగా పొలం పుట్రా దండిగా వున్నవాళ్ళే. వాళ్ళ యిస్తామన్నది... పెళ్లికూతురి పేర

## న ల్ల క లు వ లు

రెండెకరాల మాగాణీ, ఐదువేలు విలువచేసే నగలు, తనకు పదివేల రూపాయలకట్నం, ఇంకా ఏవేవో వస్తువాహనాలు!


మహాభృంగరాజ్
శిరస్సును చల్లగా వుంచేందుకు
సాటిలేని గుణములను కలిగివున్నది.

భృంగాల్
మహాభృంగరాజ్ హెయిర్ ఆయిల్
కలకత్తా కెమికల్‌వారి నవీన
కర్మాగారంలో నిఖార్సయిన
ఆయుర్వేద ఫార్ములా ప్రకారం
తయారుచేయబడింది

భృంగాల్
హెయిర్ ఆయిల్ భృంగరాజ్ ఆకుల
సారం, నువ్వుల నూనె మరియు
12 ఇతర ఆయుర్వేద దినుసులతో
కూడినది. ఇవన్నీ శిరస్సును చల్లగా
వుంచుతాయి. వినా శిరోజాలకు నూతన
సత్తువను చేకూర్చుతాయి.

ఖచ్చితమైన ఆయుర్వేద ఫార్ములా
ప్రకారం తయారుచేయబడింది
భృంగాల్
సువాసనలీనే
మహాభృంగరాజ్
హెయిర్ ఆయిల్




CTC-15 TEL


అమ్మాయి పేరు అపరంజి! పల్లెటూరి వాతావరణంలో పుట్టి పెరిగిన పిల్ల. ఈ సంబంధానికి అమ్మ మొదట ఒప్పుకోకపోయినా, నాన్న బలవంతం మీద తర్వాత ఒప్పుకోక తప్పింది కాదు.

ఎవరికి ఎలా వున్నా, తనకు మాత్రం అమ్మాయి నచ్చింది. పెళ్లిచూపుల్లో తనకేసి చూట్టానికి సిగ్గుపడుతూ ఆమె నవ్విన చిరునవ్వును తాను మరిచిపోగలడా?

* * *

పెద్దలు నిశ్చయించిన శుభముహూర్తాన అపరంజి సుందరానికి పెళ్లాం అయిపోయింది.

...భయపడుతూ, సిగ్గుపడుతూ, అడుగులో అడుగువేసుకుంటూ పడకగదిలోకి వచ్చిన అపరంజి చేయిపట్టుకొని పక్కన కూచోబెట్టుకున్నాడు సుందరం. తన్మయుడై ఆమె ముఖంలోకి చూశాడు.

'అపరంజీ!' అంటూ తనవ్రేళ్లతో ఆమె చుబుకాన్ని పట్టి పైకెత్తాడు.

అతని కన్నుల్లోకి చూసింది అపరంజి, ఎదురుగా.

'చూడు అపరంజీ! నేనెలా వున్నాను? నీకు నచ్చానా?' అన్నాడు.

ఆమె సిగ్గుచేత మాట్లాడలేకపోతోంది.

'నేను బాగాలేనని చాలామంది అంటారు. నాకూ అలాగే అనిపిస్తోంది. నీకు ఎలా వున్నాను. చెప్పు అపరంజీ! ...'

ఆమె నిలకడగా అతని ముఖంలోకి చూసింది. అతని భుజాలమీద చేతులు వేసింది. అతని మొహాన్ని కళ్లార్పకుండా కొన్ని క్షణాలు చూసింది. 'ఎవరండీ అన్నది, బాగా లేరని? మీకేం లోటు? లక్షణంగా వున్నారు!' అంది మెల్లగా. హృదయపూర్వకంగా అంది అలా అని. సుందరం సంతోషంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు.

తనకింతకన్నా మరేం కావాలి? తన కేమీ లోటు లేదని తన పెళ్లామే అంది. అపరంజికి తాను అందంగా కనిపిస్తున్నాడు. ఇతరులతో తనకు నిమిత్తం లేదు.

'అపరంజీ!...' పిలిచాడతను.

'ఊఁ?'

మబ్బులు మింగిన చందమామలా వుంది ఆమె ముఖం.

'అలా వున్నావేం?'

'ఏమీ లేదు'

కాసేపు వూరుకుందామె.

'...మీ కంటికి నేనెలా వున్నానండీ?'

'అలా అడుగుతున్నావేం ?'

'చెప్పండి'

'చాలా బాగున్నావు!'

'...నేను నల్లగా లేనూ?'

'అయితేనేం? అందంగా వున్నావు!'

'అందరూ నల్లగా—కాకిలా వున్నానంటారు' ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆమె కన్నీళ్లు తుడిచాడు సుందరం. ఆమె కళ్లలో కళ్లు పెట్టి 'అపరంజీ! నీలో అసహ్యించుకోవలసింది ఏముందో నాకర్థం కావడంలేదు. నువ్వు నల్లగా వుంటేనేం? నా కంటికి ఎంతో అందంగా వున్నావు. ఆ నల్ల రంగే నీకు అందం!' అన్నాడు లాలనగా.

అప్పుడే వికసించిన నల్ల కలువలా కలకలలాడింది అపరంజి ముఖం.

సుందరం విసరికొట్టినా విరిగిపోనిఅద్దం—పరమగురువులా నవ్వుతూ ఆ గది గోడమీదనే వేలాడుతోంది.

# మరో ప్రేమకథ

(15 వ పేజీ తరువాయి)

మనుషులందరూ చెడ్డవాళ్లు కారు. మీరీ నిజాన్ని తెలుసుకోవడం అవసరం.''

''మా సంసారాన్ని గురించి చెప్పాను. జుగుప్సాకరమైన కుటుంబం మాది. అయినా నన్ను పెళ్లాడేందుకు మీరు సిద్ధంగా వున్నారా?'' నవ్వుతూనే అడిగింది మాలతి.

''మీకు పరిహాసంగా వుంటె నేనేమీ చెయ్యలేను. ఒక్క విషయం మాత్రం నిజం. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీ కుటుంబ వ్యవహారాలు మా పెద్దలకు అవసరమే అయినా—వారిని నేను ఒప్పించగలను. దురదృష్టమేమిటంటే, మీరే నన్ను నమ్మడం లెదు''అన్నాను నిస్పృహగా.

''మన్నించండి మధూ, నన్ను ఆలోచించుకోనివ్వండి''

ఇంతలో శేషాద్రిగారు వచ్చారు. తిరిగి పనిలో నిమగ్నమయ్యాము. సాయంత్రం నాలుగు గంటలకు పనిపూర్తయింది. మాలతీ నేనూ వాన్‌లో యింటికి బయలుదేరాము. ఆమెదిగి వెళ్లబోతుండగా అభిమానాన్ని చంపుకొని 'నాకు మీ యిల్లు చూపించరూ ?' అని అడిగాను. ఆమె కాసేపు తటపటాయించి 'రండి' అన్నది. డ్రైవర్ని వెళ్లిపొమ్మని చెప్పి ఆమెను అనుసరించాను.

నన్నొక గదిలో కూర్చోబెట్టి కాఫీ తెచ్చేందుకు లోపలికి వెళ్లింది మాలతి. ఇంట్లో యెవరూ వున్న అలికిడి లేదు. గోడకు తగిలించి వున్న ఫొటోలను చూస్తూ మాలతి కుటుంబంలోని వ్యక్తుల్ని అంచెనా వేసుకోనారంభించాను.

''ఇవి తీసుకోండి'' ప్లేటులో బిస్కెట్లు తెచ్చి బల్లమీద పెట్టింది మాలతి.

''ఇవన్నీ చేస్తారనుకుంటే నేనసలు వచ్చేవాణ్ణి కాదు.''

''ఫర్వాలేదు లెండి. ఇంటికివచ్చిన అతిథికి యీ పాటి మర్యాద చెయ్యలేని స్థితిలో లేను'' అంది నవ్వుతూ.

''మీతో యేమి మాట్లాడినా చిక్కే!''

''తింటూ వుండండి, కాఫీ తెస్తాను'!అని లోనికి వెళ్లబోయింది.

''మీ నాన్నగారు, పిన్ని...''

''నాన్న బయటికి వెళ్లినట్లుంది. పిన్ని యింట్లో వుంది.''

''నేను వచ్చినట్లు తెలిస్తే...''

''గొడవ జరగవచ్చు. అయితే మీ ముందు కాదు లెండి, మీరు వెళ్లాక''అని నవ్వుతూ లోపలికి వెళ్లింది. ఎందుకు వచ్చానా అని బాధ పడ్డాను.

కాసేపట్లో రెండు కప్పుల్లో కాఫీ తీసుకు వచ్చి నాకొకటి అందించి రెండోది తాను తీసుకొని నా కెదురుగా కూర్చుంది మాలతి.

''నేను వచ్చి మీకు ముప్పుతెచ్చి పెట్టాననుకుంటాను ?''

''మీరందుకు విచారించకండి. మీరు రాకపోయినా ఆ ముప్పు నాకు తప్పేదికాదు.''

''అంత హృదయంలేని మనిషా పిన్ని ?''

''చూస్తారా ?''

''చూద్దామనే వుంది, కాని యీ రోజు కాదులెండి.''

''మీ యిల్లెక్కడ ?''

''సుల్తాన్ పురాలో — మసీదు ప్రక్కన.''

మాలతి వాళ్ల పిన్నికాబోలు — మాలతిని పిలిచింది యింట్లోనుండి. కాని మాలతి కదలకుండా అలాగే కూర్చొని వుంది.

''మీ పిన్ని పిలుస్తున్నట్లుంది ''

''ఔను.''



మే 1 న జరిగిన ఆంధ్రపత్రిక, విజయవాడ కార్యాలయ సిబ్బంది వజ్రోత్సవ వేడుకల సభలో ఉపన్యసిస్తున్న మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, వేదికపైన వున్నవారు వరుసగా శ్రీయుతులు బాలాంత్రపు రజనీకాంతరావు (ఆకాశవాణి డైరక్టరు), మంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు, సభాధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య.